క్లుప్తంగా

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం


దాత కుటుంబానికి విరాళం బాండ్ పత్రం అందజేత

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తురాలి కుటుంబం మంగళవారం రూ. 1,01,116 విరాళంగా అందజేసింది. తాడేపల్లి గూడెంకు చెందిన టి.హరిలక్ష్మి ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాత కుటుంబానికి ఆలయ ఏఈఓ దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

శ్రీవారి సన్నిధిలో..


శ్రీవారి సన్నిధిలో సూర్యనారాయణ దంపతులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని రాష్ట్ర దేవదాయశాఖ(రెవెన్యూ) జాయింట్ సెక్రటరీ సూర్యనారాయణ మంగళవారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆ తరువాత చినవెంకన్న జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

జాతీయస్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: చిలకలూరిపేటలో జరిగిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో జంగారెడ్డిగూడెం కుంగ్‌ఫూ ట్రైనింగ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచినట్లు కుంగ్‌ఫూ మాస్టర్ గంధం సురేష్ తెలిపారు. గంధం ఏసుబాబు, ఎం.తేజు, ఎస్.శ్రీహాస్, ఎస్.జ్ఞానక్రిష్ ప్రథమస్థానాలు సాధించగా, కె.సుదర్శన్, డి.జైనిరుప్, ఎం.లియో విక్రమ్, కె.చేతన్‌చంద్, సీహెచ్ విశ్వచరణ్, ఎస్.ఆదిశంకర రెడ్డి, ఎస్.గ్రీష్మత్‌రెడ్డి ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, బత్తిన చిన్న విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్‌లను అందించారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు


ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న శ్యామలాదేవి తదితరులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన వడ్లపూడి శ్యామలాదేవి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్, నోబెల్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించారు. ఈ నెల 25న ప్రముఖ యోగా మాస్టర్ ట్రైనర్ వసంత లక్ష్మి ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలపై పోటీ నిర్వహించారు. ఈ పోటీలో కేవలం 28 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేసి రికార్డులో స్థానం సంపాదించినట్లు శ్యామలాదేవి తెలిపారు. ఒక నమస్కారానికి 12 భంగిమల చొప్పున 108 నమస్కారాలు చేయాల్సి ఉంటుందన్నారు. 35 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

బుట్టాయగూడెం: గిరిజన చట్టాలపై ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులకు పూర్తి అవగాహన అవసరమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో మంగళవారం వివిధ శాఖలకు చెందిన అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ న్యాయ సలహాదారు పల్లా త్రినాథరావు మాట్లాడుతూ గిరిజన చట్టాలకు సంబంధించిన ఎల్‌టీఆర్, 1/70, పీసా, ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టాలు, అమలు చేయాల్సిన విధానంపై అవగాహన కలిగించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

లింగపాలెం: అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. వేములపల్లికి చెందిన బంటు నానిబాబు (33) తనకు ఉన్న కొద్దిపాటి భూమితో పాటు కౌలుకు మరికొంత భూమి తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పెట్టుబడి కోసం అప్పు చేసి పలు రకాల పంటలు సాగు చేసినా కలిసిరాలేదు. దీంతో అప్పులు ఎలా కట్టాలో తెలియక మనస్తాపంతో మంగళవారం తన పొలంలో ఉన్న టేకు చెట్టుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. హెచ్‌సీ బి.గణపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- వెంకటకృష్ణాపురం, ఏపుగుంట గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవం


ద్వారకాతిరుమల: వెంకటకృష్ణాపురంలో వర్చువల్ విధానం ద్వారా సీఎం చేస్తున్న ప్రారంభోత్సవాలను వీక్షిస్తున్న ఎమ్మెల్యే తలారి, పార్టీ నేతలు, అధికారులు


టి.నరసాపురం: ఏపుగుంట గ్రామంలో నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం కంట్రోల్ రూమ్

ద్వారకాతిరుమల: రైతులకు పగటిపూట 9 గంటల నాణ్యమైన విద్యుత్తును అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని వెంకటకృష్ణాపురంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ నూతన సబ్‌స్టేషన్ నుంచి ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానానికి ప్రత్యేక లైన్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అనంతరం విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సీహెచ్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణంతో లోవోల్టేజి సమస్య తీరి, నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. తద్వారా వ్యవసాయ, పారిశ్రామిక, పర్యాటక, ఆక్వా రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయన్నారు. వెంకటకృష్ణాపురంలో నిర్మించిన ద్వారకాతిరుమల విద్యుత్ సబ్‌స్టేషన్ ద్వారా ద్వారకాతిరుమల, పెదవేగి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట మండలాల్లోని పలు ప్రాంతాలకు చెందిన సుమారు 1.05 లక్షల మందికి, ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, స్థానిక సొసైటీ చైర్‌పర్సన్ గోపా నాగేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఈఈలు బి.నాగభూషణం, ఇ.సురేష్ కుమార్, పవన్ ప్రసాద్, డీఈఈ రాజ్‌కుమార్ బాబు, పి.శ్రీనివాసరావు, గోపాలకృష్ణ, రాకేష్‌రాజ్, డి.మురళీకృష్ణ, వినయ్‌కుమార్, ఏఈలు గంగమురళీ, షేక్ అహ్మద్, ప్రేమ్‌కుమార్, జయ, వైఎస్సార్ సీపీ నేతలు ఘంటా విఘ్నేశ్వరరావు, యలమర్తి గాంధి, పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్, మానుకొండ సుబ్బారావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, చెలికాని బుల్లియ్య, గుర్రాల లక్ష్మణ్, బొండాడ వెంకన్నబాబు, దాసరి ఏసురత్నం, దాకారపు అగ్గియ్య తదితరులున్నారు.

నిరంతర విద్యుత్‌కు మార్గం సుగమం

టి.నరసాపురం: టి.నరసాపురం మండలం ఏపుగుంట గ్రామంలో రూ. 60.20 కోట్ల వ్యయంతో నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తాడేపల్లి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఇప్పటి వరకు టి.నరసాపురం ప్రాంత పరిధిలో 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ లేదు. ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందుతున్న వ్యవసాయ, గృహ రంగ, పారిశ్రామిక అవసరాలు తీర్చడానికి మండలంలోని ఏపుగుంట గ్రామంలో 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. ఈ సబ్‌స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాలైన టి.నరసాపురం, కామవరపుకోట, చింతలపూడి మండలాల్లోని కొన్ని ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం కలుగుతోంది. ఈ సబ్‌స్టేషన్‌లో రెండు 31.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. అలాగే ఈ సబ్‌స్టేషన్ నుంచి 220/132 కేవీ, 132/33 కేవీ కామవరపుకోట సబ్‌స్టేషన్‌లు ఎస్‌సీ లైన్ ద్వారా కలిపారు. అదేవిధంగా టి.నరసాపురం సబ్‌స్టేషన్‌నుంచి 220/132/33 కేవీ అశ్వారావుపేట ఉపకేంద్రాన్ని సైతం డీసీలైన్ ద్వారా కలిపారు. దీంతో నిరంతరాయ విద్యుత్ అందించేందుకు మార్గం సుగమమైంది.

పారిశ్రామిక రంగ అభివృద్ధికి అవకాశం



నిరంతరాయ విద్యుత్ అందించేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగానే టి.నరసాపురంలో మండలంలో 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మించడం జరిగింది. ఇందుకు గాను రూ. 60.20కోట్లు వెచ్చించాం. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం వల్ల పగటిపూట నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు వీలు కలుగుతుంది. అదేవిధంగా టి.నరసాపురం మండలంలో పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంది.

– తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం నియోజకవర్గం

జాబ్‌మేళా పోస్టర్ విడుదల

బుట్టాయగూడెం: ఈ నెల 30వ తేదీన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే మెగా జాబ్ మేళాలో 18 కంపెనీలు పాల్గొంటున్నాయని, నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ తెలిపారు. కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన జాబ్‌మేళా పోస్టర్‌ను పీఓ మంగళవారం విడుదల చేశారు. జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.ప్రవీణ్, ఎం.నాగరాజు, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి లక్ష బిల్వార్చన


స్వామివారికి బిల్వాలతో అర్చన చేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన చెరువు వీధిలోని శ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం స్వామివారికి లక్ష బిల్వార్చన, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్ర దీపోత్సవ వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయ అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణలతో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని, లక్ష బిల్వాలతో అర్చనను జరిపారు. సాయంత్రం సహస్ర దీపోత్సవంలో ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు సతీమణి భాగ్యలక్ష్మి అఖండ దీపాన్ని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

జంగారెడ్డిగూడెంలో చోరీలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని వేర్వేరు ప్రదేశాల్లో మంగళవారం చోరీ ఘటనలు చోటుచేసుకున్నాయి. స్థానిక రాములమ్మ చెలకలో ఒక ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి యజమానులు ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్ వెళ్లడంతో తాళాలు పగులగొట్టి చోరీ చేసినట్లు భావిస్తున్నారు. ఇంట్లో రెండు కాసుల బంగారం, నాలుగు జతల వెండి పట్టీలు చోరీకి గురైనట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే పోలీసులకు దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులకు క్లూస్‌టీమ్‌ను రప్పిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే స్థానిక అయ్యప్ప టౌన్‌షిప్‌లో 3వ రోడ్డులోని పక్కపక్కనే ఉన్న రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఇంటి యజమానులు కూడా పొరుగూరు వెళ్లారు. ఒక ఇంట్లో మాత్రం రూ.12 వేలు నగదు పోయినట్లు గుర్తించగా, మరో ఇంట్లో ఎటువంటి నగదు, వస్తువులు చోరీకి గురికాలేదని తెలిసింది.

అక్కంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని అక్కంపేట రైతు భరోసా కేంద్రంలో శ్రీనివాసపురం సొసైటీ తరుపున ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్‌పర్సన్ పోల్నాటి బుచ్చిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా బుచ్చిరాజు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ద్వారా రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకుని గిట్టుబాటు ధర పొందాలన్నారు. సొసైటీలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పారేపల్లి నాగేంద్రబాబు, పసుపులేటి రత్నకుమారి, ఎంపీటీసీ రామిశెట్టి రాజు, సీఈవో ఎలికే సరేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

కామవరపుకోట: ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఎంపీటీసీ బోల్లు వెంకట సత్యనారాయణ కోరారు. మంగళవారం స్థానిక బీసీ బాలురు వసతిగృహం విద్యార్థులకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నాగరాజు, ఎంపీపీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లతా సతీష్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

పూలేను యువత ఆదర్శంగా తీసుకోవాలి


జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, పార్టీ నాయకులు


చింతలపూడి: నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మహాత్మ జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్యగారి ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి, అలాగే ఏలూరు రోడ్డు బస్టాండ్ దగ్గర ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంఘిక దురాచారాలను ఎండగడుతూ, మహిళాభ్యున్నతికి జ్యోతిరావు పూలే కృషిచేశారని కొనియాడారు. ఆనాడే మహిళా విద్య ఆవశ్యకతను గుర్తించి, తన భార్యను విద్యావంతురాలిని చేయడంలో పూలే కృషి ఎనలేనిదన్నారు. బడుగు, బలహీన వర్గాల ఉద్ధరణ కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, కౌన్సిలర్లు ఎల్.వెంకటేశ్వరరావు, నేకూరి కిషోర్, ఉగ్గం దుర్గాప్రసాద్, కోఆప్షన్ సభ్యులు వెంప బిజి, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, గూడపాటి రాధాకృష్ణ, కటారి సీతారాములు, చిప్పాడ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి: స్థానిక నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మా జ్యోతీరావ్ పూలే వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె నాగరాజు మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి పూలే పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధ్యక్షుడు ద్రాక్షవరపు గంగాధరరావు, చింతలపూడి మండల అధ్యక్షుడు పరిమి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఆచంట సాయి, గౌరవ అధ్యక్షుడు పరిమి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతీరామ్‌పూలే వర్ధంతి నిర్వహించారు.

మోటార్‌సైకిళ్ల చోరీ కేసులో బాలుడి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: మోటార్‌సైకిళ్ల చోరీ కేసులో ఓ బాలుడిని పోలీసులు పట్టుకున్నారు. స్థానిక తాండ్ర పాపారాయుడు నగర్ సమీపంలోని సుబ్బంపేటలో నివసిస్తున్న 13ఏళ్ల బాలుడు 9 మోటార్‌సైకిళ్లు చోరీ చేసినట్లు సీఐ పి.రాజేష్ తెలిపారు. వివరాల ప్రకారం.. మారుతాళాలతో మోటార్‌సైకిల్‌ను దొంగిలించడం, దానిని ఎక్కడో ఓ చోట తాకట్టు పెట్టడం లేదా అమ్మడం ఈ బాలుడు చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో పట్టణంలో ఒక యువకుడికి చెందిన మోటార్‌సైకిల్ చోరీకి గురైంది. అయితే ఆ మోటార్‌సైకిల్‌ను చోరీకి గురైన యువకుడి స్నేహితుడికే బాలుడి విక్రయించేందుకు ప్రయత్నించాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బాలుడిని అదుపులోకి తీసుకుని ఇప్పటి వరకు చోరీ చేసిన 9 మోటార్‌సైకిళ్లను రికవరీ చేశారు. కేవలం నాలుగు నెలల వ్యవధిలో బాలుడు ఈ మోటార్‌సైకిళ్లను చేశాడని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. కాగా, కేసును ఛేదించిన ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి, క్రైం పార్టీ హెడ్‌కానిస్టేబుల్ రాజేంద్ర, కానిస్టేబుల్ పి.సత్యనారాయణలను సీఐ రాజేష్ అభినందించారు.

ఓటు నమోదుపై అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ కె.గీతాంజలి

జంగారెడ్డిగూడెం: 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని చింతలపూడి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌ఓ),స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.గీతాంజలి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదుపై అవగాహన సదస్సు సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్టోరల్ పార్టిసిపేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన గీతాంజలి నూతన ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. యువతీ యువకులు తమ గ్రామాల్లో ఉన్న బీఎల్‌ఓలను కలిసి ఓటు నమోదు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమం అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్‌ఓ, తహసీల్దార్ కె.స్లీవజోజి, చింతలపూడి ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఎ.శేఖర్ బాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు, త్రివేణీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బుద్దాల సురేష్, ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు ఎం.శ్రీనివాసరావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, పాల్గొన్నారు.

మహిళలపై హింసను వ్యతిరేకించాలి


అచ్చియ్యపాలెంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న స్నేహాన్

బుట్టాయగూడెం: మహిళలపై జరుగుతున్న హింసను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సచివాలయాల శాఖ ఎస్‌వి సీసీ కోఆర్డినేటర్ టీఎస్ స్నేహాన్ అన్నారు. మండలంలోని అచ్చియ్యపాలెంలో మంగళవారం మహిళలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలపై జరిగే హింసను రెండు రకాలుగా వర్గీకరించాలని వాటిలో గృహహింస, బహిరంగ హింసగా గుర్తించాలని చెప్పారు. మహిళలపై హింసను తగ్గించడానికి 1979లో ఐక్యరాజ్య సమితి తీర్మానం చేసిందని చెప్పారు. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 22 వరకూ దేశవ్యాప్తంగా ప్రచారోద్యమం జరుగుతుందని చెప్పారు. మహిళలు తమపై జరిగిన హింసను ఎదుర్కొనేందుకు అవగాహన పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.వెంకటేశ్వరరావు, మండల సమాఖ్య సభ్యులు, గ్రామ సచివాలయ కార్యదర్శి పి.సోమరాజు, ఏపీఎమ్ సత్యనారాయణ, వెల్ఫేర్ కార్యదర్శి ఎం. పోశమ్మ, మహిళా పోలీసు పి.జయమ్మ, సీసీ మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కామవరపుకోట: సమాజనికి చేసిన సేవలను గుర్తించి ఇటీవల రితిక ఫౌండేషన్ అందించిన నంది అవార్డు గ్రహీత, కడించర్ల విశాలా గుప్తా దంపతులను మంగళవారం వాసవి క్లబ్, వనితా క్లబ్, ఆర్య వైస్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విశాలి గుప్తా మాట్లాడుతూ సమాజానికి సేవలు అందిస్తున్నందుకుగాను అవార్డ్ తనకు రావటం ఎంతో సంతోషంగా ఉందని, రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ సభ్యులు జయవరపు లక్ష్మణ వరప్రసాద, నంబూరు వరప్రసాద్, వంకదార ఉదయ్ కుమార్, బచ్చు ముత్యాలరావు, కొండూరు సుధాకర్, కంభంపాటి రత్నకుమారి, గుడిమెట్ల వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన


చింతలపూడి: లింగగూడెం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం రూరల్: పేరంపేటలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి

చింతలపూడి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పాలన సాగుతుందని మండల పరిషత్ అధ్యక్షుడు డా.బి.రాంబాబు నాయక్ అన్నారు. ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని లింగగూడెం సచివాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పి.ప్రభావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీపీ రాంబాబు నాయక్ ప్రజలకు వివరించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను సీఎం వైఎస్ జగన్ నూటికి 99 శాతం అమలు చేశారని తెలిపారు. రాష్ట్రానికి మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సభలో సంక్షేమ పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మేడి చినకుమారి, నోడల్ అధికారి విక్టర్ బాబు, సచివాలయ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

పేరంపేటలో వై ఏపీ నీడ్స్ జగన్

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పేరంపేటలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజల వద్దకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ ఇర్ల విజయశాంతి, పార్టీ నాయకులు గంజి వినోద్, ఇర్ల శ్రీనివాసరెడ్డి, కఠారి సీతారాంబాబు, కఠారి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగన్ రావాలి

లింగపాలెం: సంక్షేమ పథకాలు పారదర్శకంగా పేదలకు చేరాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహనరెడ్డి రావాలని వైస్ ఎంపీపీ మట్టా సురేష్ అన్నారు. కలరాయునగూడెం గ్రామంలో మంగళవారం గ్రామ సచివాలయ కన్వీనర్ చలగుళ్ల సూరిబాబు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండాన ఆవిష్కరించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతారావు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో...

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని సచివాలయం 3 పరిధిలో మంగళవారం ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యామల శ్రీదేవి, కాశీ ధనలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దత్తి రాంబాబు, ఏఎంసీ డైరెక్టర్ షేక్ ఫాతిమున్నీసా, వైఎస్సార్ సీపీ నాయకులు దత్తి కొండలరావు, కోరసిక శ్రీను, సిద్ధన వెంకటరత్నం, ఈర్నాల జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వంకావారిగూడెంలో...

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి రాష్ట్రానికి మళ్లీ జగన్ ఎందుకు కావాలి అని వివరించారు. అలాగే గడచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కోర్సా పోచమ్మ, ఎంపీటీసీ మొడియం వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, కుంజా చిన్నరాయుడు, వంకా రామకృష్ణ, కుమ్మరి టోనీ, కొప్పుల మహేష్, మొడియం నాగేశ్వరరావు, సున్నం రామారావు, ఎస్. శ్రీను, కె. రవి, తదితరులు పాల్గొన్నారు. అలాగే అదే గ్రామంలో జ్యోతీరావ్‌పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


లింగపాలెం: కలరాయునగూడెంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు


పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని సచివాలయం-3లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు


బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న దృశ్యం